క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 35, బెండకాయ 28, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 16, క్యారెట్ 33, దొండ 28, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 25, దోసకాయ 13, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 26, ఆలుగడ్డ 21, చామగడ్డ 41, మొరంగడ్డ 28, కందగడ్డ 50, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

మార్కెట్‌లోకి కొత్త బజాజ్ పల్సర్



అమీర్‌పేట: బజాజ్ సంస్థ 150 సీసీ ఇంజిన్‌తో కూడిన పల్సర్ ఎన్-150 బైక్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈఎస్‌ఐ ఎర్రగడ్డలోని ఎంజీబీ బజాజ్ షోరూమ్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన బైక్‌ను ఆవిష్కరించారు. అత్యుత్తమ బ్రేకింగ్, ట్రాక్షన్ కోసం సింగిల్ ఛానెల్ ఏబీఎస్ వంటి ఆకర్షనీయమైన ఫ్యూచర్స్ ఉన్నాయని షోరూమ్ జీఎం బిండి వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త కంజర్ల అశోక్‌కుమార్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

స్తంభాలకు కేబుళ్లు చుట్టొద్దు



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కార్పొరేటర్

అమీర్‌పేట: కాలనీల్లోని విద్యుత్ స్తంభాలకు ఇష్టానుసారంగా కేబుళ్లను చుట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగించరాదని అమీర్‌పేట కార్పొరేటర్ సరళ అన్నారు. మంగళవారం ఆమె పలు ప్రాంతాల్లో పర్యటించి స్తంభాలకున్నా కేబుళ్లను చూసి సంబంధిత వ్యక్తులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేబుళ్లు ఎక్కువగా ఉంటుండడంతో కొన్ని సందర్భాల్లో విద్యుదాఘాతాలు సంభవిస్తున్నాయన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలపై సమీక్ష



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సికింద్రాబాద్: నామాలగుండులోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో జరిగే 29వ వార్షిక దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై మంగళవారం సమీక్ష జరిగింది. ఈఓ జీ. శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జై బజరంగ్ మిత్రమండలి సభ్యులు పాల్గొని శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవ కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ గిరి, ధనుష్, రాజు, మురళి, అరవింద్, కిషోర్, వాసు, ఆలయ సిబ్బంది జగపతి, అర్చకులు ప్రణవ్, మనోహర్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ



చీరలను పంపిణీ చేస్తున్న డీపీఓ శ్రీనాథ్

అడ్డగుట్ట: అర్హులైన మహిళలందరూ స్థానిక పంపిణీ కేంద్రాలలో బతుకమ్మ చీరలను తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ యూసీడీ డీపీఓ శ్రీనాథ్ సూచించారు. బతుకమ్మ చీరల పంపిణీ నేపథ్యంలో అడ్డగుట్టలోని పలు పంపిణీ కేంద్రాలను ఆయన మంగళవారం సందర్శించి పంపిణీ తీరును పరిశీలించారు. అనంతరం శ్రీనాథ్ మాట్లాడుతూ.. బతుకమ్మ చీరల కోసం వచ్చే మహిళలు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు.

కారుకు పోటీ ఎవరో?



- సనత్‌నగర్‌లో రసవత్తరంగా రాజకీయం
- కాంగ్రెస్, భాజపా అభ్యర్థుల్లో తేలని స్పష్టత
- ప్రత్యర్థులెవరోనని బీఆర్‌ఎస్‌లో చర్చ



బన్సీలాల్‌పేట్: సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో విపక్షాల అభ్యర్థులెవరో అయోమయం కొనసాగుతోంది. ఇప్పటికే తెలంగాణలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఇంకా పలు పార్టీల తరఫున బరి లో నిలిచే నాయకులెవరనేది స్పష్టత లేదు. ఎన్నికల బరిలో నిలిచే అదృష్టం ఎవరిని వరిస్తుందోననే అంశంపై నియోజకవర్గంలోని చర్చానీయాంశంగా మారుతోంది. సనత్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీల మధ్య పోటీ జరగనుంది. ఇప్పటికే అధికార బీఆర్‌ఎస్ పార్టీ తన అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ప్రకటించింది. అయితే..ప్రధాన పార్టీల అభ్యర్థులెవరనే ఆందోళన అందరిలో మెదులుతోంది. తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో బరిలో దిగేది ఎవరనే దానిపై తీవ్ర చర్చ సాగుతోంది.

గట్టి అభ్యర్థిని రంగంలో దింపేలా..

ప్రచారాన్ని సాగిస్తున్నా ప్రత్యర్థి ఎవరనేది తెలుసుకోడానికి బీఆర్‌ఎస్ నాయకులు ఆసక్తి చూపిస్తున్నారు. ఎవరు పోటీలో ఉంటే గెలుపు సునాయసం అవుతుందోననే లెక్కలు వేసుకుంటున్నారు. సనత్‌నగర్ నుంచి బీఆర్‌ఎస్‌కు గట్టి పోటీనిచ్చే నేతలను రంగంలోకి దిచ్చేలా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు వ్యూహాన్ని పన్నుతున్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రజాక్షేత్రంలో వివిధ ప్రజాభివృద్ధి కార్యక్రమాలు, పర్యటనలు, పాదయాత్రలతో ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ ఓట్ల వేటలో తలమునకలై సాగిపోతున్నారు. ఏదిఎమైనా సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల పోరు అన్ని పార్టీలకు అంత సులువుకాదని రాజకీయ విశ్లేషకులు చర్చించుకుంటున్నారు.

కాంగ్రెస్ నుంచి..

సనత్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి అనేక మంది టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. గతంలో ఈ నియోజకవర్గానికి కాంగ్రెస్ తరఫున మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. అయితే ఇక్కడి నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేయాలని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి తనయుడు మర్రి ఆదిత్యరెడ్డి, డాక్టర్ రవీందర్ గౌడ్, డాక్టర్ కోట నీలిమా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులు ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీ పథకాల పేరిట పాదయాత్రలు చేస్తున్నారు. అయితే అధిష్ఠానం ఎవరికి బరిలో నిలుపుతుందనేది ఉత్కంఠ మారింది.

ఓటర్ల సరళి

సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,44,946 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 127436, స్త్రీలు 117502 ఇతరులు 8 మంది ఉన్నారు.

బీజేపీ నుంచి..

బీజేపీ అభ్యర్థిపై సైతం ఉత్కంఠ సాగుతుంది.అయితే ఇటీవలే కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, రాంగోపాల్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర భర్త శ్రీకాంత్, మహంకాళి జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్, మరో నాయకురాలు ఆకుల విజయ టికెట్ ఆశిస్తున్న వారి జాబితాలో ఉన్నారు. అయితే బీజేపీ టికెట్ ఎవరికి వరిస్తుందోననే ఆసక్తి పార్టీ శ్రేణుల్లో తీవ్రంగా ఉంది.

సాంకేతికతతో కాలుష్యానికి చెక్ పెట్టాలి

టీఎస్‌పీసీబీ వర్క్‌షాప్‌లో వక్తలు



వర్క్‌షాప్‌లో హాజరైన ఫార్మా కంపెనీల ప్రతినిధులు

సనత్‌నగర్: ఫార్మా కంపెనీలు అధునాతన పద్ధతులను అవలంబిస్తూ కాలుష్యానికి చెక్ పెట్టాలని పలువురు వక్తలు స్పష్టం చేశారు. సనత్‌నగర్‌లోని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో మంగళవారం ఫార్మాస్యూటికల్ పరిశ్రమల్లో పాటిస్తున్న సాంకేతికత, ఉత్తమ విధానాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దివిస్ లేబరేటరీస్ మాజీ డైరెక్టర్ మధుసూదన్‌రావు, నాట్కో ఫార్మా లిమిటెడ్ సీనియర్ జనరల్ మేనేజర్ చిలుకూరి శ్రీనివాసరావు, డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్ ఎన్విరాన్‌మెంట్ టీమ్ లీడర్ సాయికృష్ణ తదితరులు హాజరై ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలో 263 ఫార్మాస్యూటికల్ పరిశ్రమలు ఉన్నాయని, రియల్ టైమ్ ఆన్‌లైన్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా ఆయా పరిశ్రమలను బోర్డు పర్యవేక్షిస్తోందని ఈ సందర్భంగా చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ రఘు స్పష్టం చేశారు. ఫార్మా పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కోవడానికి వినూత్న, స్థిరమైన విధానాలు అవసరమన్నారు. పరిశ్రమల్లో ముఖ్యంగా ద్రావకాలు, ఆమ్లాలు, క్షారాలు వంటి అనేక రసాయనాలను ఉపయోగిస్తుంటారని, ఈ క్రమంలో ఆయా పరిశ్రమల ద్వారా రసాయన వ్యర్థాలు, ఉద్గారాలు, ఘన వ్యర్థాల రూపంలో వాతావరణంలోకి వదులుతుంటాయన్నారు. అయితే అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా కాలుష్య ఉద్గారాలు, రసాయన వ్యర్థాలు బయటకు రాకుండా శుద్ధి చేయవచ్చన్నారు.

విద్యా కమిషన్ ఏర్పాటుకు వినతి



వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

అడ్డగుట్ట: తెలంగాణలో విద్యా ప్రమాణాల పర్యవేక్షణకు స్వయం ప్రతిపత్తి గల విద్యా కమిషన్ ఏర్పాటు చేసే విధంగా బీజేపీ మేనిఫెస్టో కమిటీలో పెట్టాలని తల్లుల సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు, బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ ఎన్. ఇంద్రసేనారెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పాఠశాల విద్యా వ్యవస్థలో యూడీఐఎస్‌ఈ ఆధారంగా రాష్ట్రాలు, జిల్లాల వారీగా పని తీరును లెక్కిస్తూ ప్రభుత్వం పెర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 2021-22 విడుదల చేసిందన్నారు. ఈ నివేదికలో అభ్యసన ఫలితాలు, మౌలిక వసతులు, సమానత్వం, పాలనా ప్రక్రియ, విద్యార్థుల నమోదు, ఉపాధ్యాయులకు విద్యా శిక్షణ అనే ఆరు అంశాల ప్రాతిపదికన మార్కులు కేటాయించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం 1000 మార్కులకు కేవలం 479.9 పాయింట్లతో దేశంలోని 36 రాష్ట్రాలలో 31 స్థానంలో నిలిచిందన్నారు. నాణ్యమైన విద్యను అందించకపోవడం కారణంగా ప్రజలు ఎదుర్కొనే అనేక సామాజిక సవాళ్లకు ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. వినతి ఇచ్చిన వారిలో సాయిలక్ష్మి, సత్యవతి, రేణుక, రామలీల, లక్ష్మణ్, బర్కల్ అలీ, చింతల లక్ష్మీనారాయణ, వీరేశ్ చారి ఉన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలో చదువుతున్న విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగు పర్చడానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

విశ్వవిద్యాలయాల సమస్యలు పరిష్కరించాలి



ప్రొ. ఇటికాల పురుషోత్తం

లాలాపేట: తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని టీజేఏసీ చైర్మన్ ప్రొ. ఇటికాల పురుషోత్తం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల పరిస్థితి అధ్వానంగా తయారైందని ఉన్నత విద్యను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. విశ్వవిద్యాలయాల అధ్యాపకులు తమ సమస్యల పరిష్కారం కోసం ఎన్నో విధాలుగా ప్రభుత్వానికి వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులకు తమ రిటైర్మెంట్ వయస్సును 58 నుంచి 61కి పెంచి హెల్త్ కార్డులు కూడా ఇచ్చిందని కానీ విశ్వవిద్యాలయాల రిటైర్మెంట్ వయస్సు పెంపు విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తుందన్నారు. యూనివర్సిటీ అధ్యాపకులు రిటైర్మెంట్ వయస్సు పెంపు, హెల్త్ కార్డులు, యూనివర్సిటీల్లోని ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న గంపా నాగేశ్వర్‌రావు

రసూల్‌పురా: ఇంపాక్ట్ ఫౌండేషన్ సహకారంతో కంటోన్మెంట్ బొల్లారంలో బీజేపీ నాయకులు విజయ రామరాజు ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం తల్లిదండ్రుల విలువలు, ఆరోగ్యం, క్రమశిక్షణ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ అధ్యక్షులు గంపా నాగేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై అమ్మ నాన్న, దైవం, విద్య, ఆరోగ్యం, ఆటలు తదితర అంశాలపై 1-5 తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేటి విద్యార్థులు సృజనాత్మకతను నైపుణ్యతను మెరుగు పరుచుకోవాలని సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ విలువలను పాటించాలని సూచించారు. మోటివేషన్ స్పీకర్లు కైలస్ శ్రీధర్, పట్నాల సావిత్రి, రాజశేఖర్ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జనరల్‌నాలెడ్జ్ క్విజ్ పోటీలు నిర్వహించి విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు కిరణ్‌కుమార్, వినోద్. జోసఫ్, సామల సత్తిరెడ్డి, మహమ్మద్, ప్రవీణ్ కుమార్, నాగరాజు, ధన్‌రాజు, లక్ష్మణ్, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న మహిళపై కేసు

అడ్డగుట్ట: అర్ధరాత్రి సమయంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ మహిళపై కేసు నమోదు చేసిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దయాకర్ వివరాల ప్రకారం.. తుకారాంగేట్ మరాఠా బస్తీకి చెందిన మంజుల(25) సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న తుకారాంగేట్ పోలీసులు దాడులు నిర్వహించి సదరు మహిళపై కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జైలు

అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ పలువురికి జైలుశిక్షతో పాటు జరిమానా విధించారు. ఇన్‌స్పెక్టర్ కొమురయ్య వివరాల ప్రకారం.. మంగళవారం వివిధ ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డ ఆరుగురిని నాంపల్లి కోర్టులో ప్రవేశపెట్టగా నలుగురికి రెండ్రోజుల జైలు, రూ.2100 జరిమానా, ఇద్దరికి నాలుగు రోజుల జైలు, రూ.3300 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య

రాంగోపాల్‌పేట్: అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గుజరాత్‌కు చెందిన సంతోష్-అనిత (44) భార్యాభర్తలు, వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉండగా కుమార్తెకు వివాహం అయింది. పెద్ద కుమారుడు పుణెలో ఉండగా చిన్న కుమారుడితో కలిసి చెన్నైలో ఉండేవాళ్లు. అక్కడ ఉపాధి అవకాశాలు లేకపోవడంతో నగరంలో ఉన్న బంధువుల వద్దకు వచ్చి శివాజీనగర్‌లో ఉంటూ మసాలా ప్యాకెట్లు మార్కెట్‌లో విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. అనిత గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. సోమవారం రాత్రి బాత్రూమ్ శుభ్రం చేసే యాసిడ్‌ను తాగడంతో కుటుంబ సభ్యులు గుర్తించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.

మహిళా సాధికారతే లక్ష్యం

పంజగుట్ట: మహిళా సాధికారతే లక్ష్యంగా ఆల్ ఇండియా మహిళా ఎంపవర్మెంట్ పార్టీని ప్రజల ముందుకు తీసుకువచ్చినట్లు పార్టీ కోర్ కమిటీ హెడ్ వరప్రసాద్ తెలిపారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలనే హీరా గ్రూప్ అధినేత నౌహిరా షేక్ పార్టీని స్థాపించి ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి నిలబెట్టారన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ..2017లో స్థాపించిన పార్టీ కర్నాటక ఎన్నికల్లో 224 స్థానాల్లో పోటీచేసి అత్యధికశాతం ఓట్లు సాధించిందని, మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసి ఎక్కువ సంఖ్యలో సర్పంచ్‌లను గెలుచుకుందని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో తెలంగాణలో 119 స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దించుతామన్నారు. 'ఆకలినైనా భరిస్తాం అవమానాలు సహించం' అనే నినాదంతో ముందుకు సాగుతున్నాయని రాబోయే ఎన్నికల్లో మహిళలు, నిరుద్యోగులకు ఎక్కువ స్థానాలు కేటాయిస్తామన్నారు. పార్టీ న్యాయ సలహాదారులు ఆర్.మాధవరావు, డాక్టర్ మీనాక్షి, పద్మనాభం, తార, దీప, నాగమంజరి, పూనజ, శారద పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఇటీవల ఖైరతాబాద్ జోన్ డీఎం హెచ్‌ఓగా నియమితులైన డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మంగళవారం రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ గడల శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. -సాక్షి, సిటీబ్యూరో

మానసిక ఆనందంతోనే సంపూర్ణ ఆరోగ్యం



వరల్డ్ మెంటల్ హెల్త్‌డే వేడుకల్లో పాల్గొన్న వైద్యులు, విద్యార్థులు

గాంధీఆస్పత్రి : మానసిక ఆనందంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని, మానసిక రుగ్మతలు, ఒత్తిడిని జయించి అనుకున్న లక్ష్యాన్ని సాధించుకోవాలని, ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదని పలువురు వైద్య నిపుణులు పేర్కొన్నారు. సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సైక్రియాట్రి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం వరల్డ్ మెంటల్ హెల్త్‌డే అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ ఆస్పత్రి, ఎర్రగడ్డ మానసిక వైద్యశాల సూపరింటెండెంట్లు రాజారావు, ఉమాశంకర్ మాట్లాడుతూ... గతేడాది వివిధ కారణాలతో ప్రపంచవ్యాప్తంగా సుమారు 8 లక్షల మంది ఆత్మహత్యలకు పాల్పడినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన, ఒత్తిడి, రుగ్మతలు, నిరాశ, వివక్ష, అహంకారం (ఇగో) సమస్యలతో మానసిక వ్యాధులకు గురవుతున్నారని, చిన్నపాటి జ్వరం వస్తే వైద్యుని వద్దకు వెళ్లేవారు, మానసిక రుగ్మతల బారిన పడినప్పటికీ మనోవైద్యులను సంప్రదించేందుకు ముందుకురాకపోవడం దురదృష్టకరమన్నారు. మూఢనమ్మకాలను వీడి ర్యాంకులు, మార్కుల కోసం విద్యార్థులపై ఒత్తిడి చేయవద్దని, వారికి ఏ అంశంపై అభిరుచి ఉందో గుర్తించి తగిన విధంగా ప్రోత్సహించాలని సూచించారు. మానసిక ఆరోగ్యంపై పలు అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్‌ఓడీలు శ్రవణ్‌కుమార్, జార్జ్, కృష్ణమోహన్, రవిశేఖర్, షరిమ్మల, శాంతిశ్రీ, నరేందర్‌కుమార్, మహాలక్ష్మీ, ఆర్‌ఎంఓ-1 జయకృష్ణ, సైక్రియాట్రి వైద్యులు అజయ్‌కుమార్, సురేష్, అనుపమ, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికే 'ఆరు హామీలు'



ప్రచారం చేస్తున్న రవీందర్‌గౌడ్



స్థానికులతో మాట్లాడుతున్న దీపక్ జాన్

సనత్‌నగర్: ఇంటింటా వెలుగులు నింపేందుకు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ హామీలను తీసుకువచ్చిందని సనత్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. ఇంటింటికీ ఆరు గ్యారెంటీ పథకాల విస్తృత ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన బేగంపేట భగవంతాపూర్‌లో పర్యటిస్తూ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్ల ప్రజలు విసిగిపోయారని కాంగ్రెస్ పార్టీ అధికారంతోనే అందరి బతుకులు బాగుపడతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీ పథకాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్, కమల్‌రాజ్, మణిమాల, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

అడ్డగుట్ట: ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్ దీపక్ జాన్ అన్నారు. మంగళవారం అడ్డగుట్ట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆయన పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దీపక్ జాన్ మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలకు అందించబోతున్న 6 గ్యారంటీల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ పాదయాత్రలో కాంగ్రెస్ నేతలు రాంలీలా, సునీల్, నవీన్, ఉమ, భారతి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వీధిదీపాల నిర్వహణ మెరుగుపడాలి



అధికారులతో సమావేశమైన జెడ్సీ రవికిరణ్

సికింద్రాబాద్ : సికింద్రాబాద్ జోన్ పరిధిలో వీధిదీపాల నిర్వహణ మరింత మెరుగుపడాలని జోనల్ కమిషనర్ రవికిరణ్ సూచించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో వీధిదీపాల నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సిబ్బంది, విద్యుత్ అధికారులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. సికింద్రాబాద్ జోన్ పరిధిలో 71263 వీధిదీపాలు, 4690 సీసీఎం బాక్సులు ఉన్నాయని, వీధిదీపాల నిర్వహణపై తరుచూ ఫిర్యాదులు అందుతున్నాయని ఫిర్యాదు అందిన వెంటనే జీహెచ్‌ఎంసీ విద్యుత్ విభాగం, ఈఈఎస్ఎల్ సిబ్బంది తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

వాహన తనిఖీలు ముమ్మరం



తనిఖీ నిర్వహిస్తున్న ఎస్‌ఐ వరలక్ష్మీ

సనత్‌నగర్: శాసనసభ ఎన్నికలకు నగారా మోగిన దరిమిలా కోడ్ అమల్లోకి రావడంతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లో పోలీసులు నిఘా పెంచారు. ఓటర్లను ప్రలోభలు పెట్టే దిశగా నగదుతో పాటు ప్రజాకర్షణీయ ఉత్పత్తులను తరలించే అవకాశాలు ఉన్న దృష్ట్యా ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేసి పంపుతున్నారు. బేగంపేట ఇన్‌స్పెక్టర్ జుట్టు భాస్కర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ వరలక్ష్మి, సిబ్బంది మంగళవారం హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వద్ద ప్రధాన రహదారిలో తనిఖీలు నిర్వహించారు. అలాగే సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ బాలరాజ్ ఆధ్వర్యంలో సిబ్బంది భరత్‌నగర్, ఫతేనగర్, మోతీనగర్ ప్రాంతాల్లో తనిఖీలు జరిపారు.

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న కల్నల్ అనిల్‌కుమార్



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

రసూల్‌పురా: సికింద్రాబాద్ బైసన్‌పోలో మైదానంలో 7వ తెలంగాణ గరల్స్ ఎన్‌సీసీ కేడెట్ల వార్షిక శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిశాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి యోగా, స్వీయ రక్షణ, డ్రిల్ ప్రాక్టిస్, ఫైరింగ్, వ్యక్తిత్వ వికాసం, ఇతర అంశాలపై శిక్షణ నిర్వహించారు. శిక్షణలో భాగంగా డాక్టర్ చిన్మయి రచించిన ఆర్టీఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో ప్రతికూల ప్రభావం, ఇస్కాన్ నుంచి రోమాచే మైండ్‌ఫుల్‌నెస్, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డు భద్రత అంశాలు, సైబర్ సెక్యూరిటీ సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ గచ్చిబౌలి ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్స్‌పై అవగాహన, తిరుమలగిరి అగ్నిమాపక విభాగం ఆధ్వర్యంలో ఫైర్ ఫైటింగ్ టెక్నిక్స్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమం సందర్భంగా కేడెట్లు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ అనిల్‌కుమార్ వార్షిక శిక్షణ శిబిరాన్ని సందర్శించి కేడెట్ల శిక్షణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిభ కనబరచిన కేడెట్లకు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రభాకర్ జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు



రాతపుస్తకాలు పంపిణీ చేస్తున్న అనితాప్రభాకర్

రసూల్‌పురా: తెలంగాణ ఉద్యమకారుడు, బోర్డు మాజీ సభ్యుడు బి. ప్రభాకర్ జయంతి సందర్భంగా కంటోన్మెంట్ బోర్డు మూడవ వార్డు పరిధిలో కుటుంబ సభ్యులు, అభిమానుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభాకర్ కుటుంబ సభ్యులు బోర్డు మాజీ సభ్యురాలు అనిత ప్రభాకర్ మడ్‌ఫోర్ట్‌లోని మై హోమ్ వృద్ధాశ్రమంలో అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. అన్నానగర్ బాలజ్యోతి పాఠశాల్లో గణేష్ ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో, విద్యార్థులకు రాత పుస్తకాలు స్టేషనరీ అందజేశారు. ఈ కార్యక్రమంలో సంధ్య సబిత, అనిల్, చిన్నా, హనుమంత్, సూరి, ఎల్లేష్, స్వప్న, స్వరూప, సాధన, శ్రీనివాస్ పాల్గొన్నారు.